క్లుప్తంగా

హన్వాడలో నందగోపాలుడి ఊరేగింపు



హన్వాడ: మండలకేంద్రంలో శుక్రవారం నంద గోపాలుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం కనులపండువగా జరిగింది. అనంతరం మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్ల వేడుక నిర్వహించారు.

నేడు గట్టు చెన్నరాయుడి జాతర

గండీడ్: శ్రావణమాస చివరి శనివారం పురస్కరించుకుని వరహగిరిపల్లి గట్టు చెన్నరాయుడి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా రాత్రికి మోహినీ భస్మాసుర పౌరాణిక నాటకం, అడుగుల భజన, అఖండ భజన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 4గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు రానున్నట్లు వివరించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. వాసవీమాతకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు.

ఆంజనేయస్వామికి పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ బీసీ కాలనీలో నూతనంగా నిర్మించి పునప్రతిష్ఠ చేసిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. శ్రీకాంత్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, చల్మారెడ్డి, యుగంధర్‌రెడ్డి, సత్యం, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టౌన్–3 సబ్ స్టేషన్‌లో నిర్వహణ, వివిధ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారి భగవంతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ, పద్మావతి కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మర్లు, టీచర్స్‌కాలనీ, షాషాబ్‌గుట్ట, అరబ్‌గల్లీ, మెట్టుగడ్డ నుంచి న్యూటౌన్ వరకు మెయిన్ రోడ్డు, ప్రేమ్‌నగర్, బాయమ్మతోట, సద్దలగుండు, రాజేంద్రనగర్‌లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అధికారులతో సమీక్ష..

గండీడ్: మండల కేంద్రంలో శనివారం అధికారులతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఉదయం 11గంటలకు గండీడ్ రైతువేదిక దగ్గర ఏర్పాటు చేసే సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

1న పెన్షన్ విద్రోహ దినం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని టీజీఈ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎన్‌జీఓ భవనంలో సమావేశమైన వారు అనంతరం విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనకాచారి స్మారక ఉపన్యాసాలు..

పాలమూరు: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో కె.కనకాచారి స్మారక ఉపన్యాసాలు పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు మరి కొందరు వక్తలు హాజరుకానున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



జడ్చర్లలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



రాచాలలో బోనాల ఊరేగింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యనగర్ బంగారుమైసమ్మ బోనాల ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఉదయం నుంచి బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలలో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ వేర్వేరుగా వేడుకల్లో పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్, అడ్డాకుల మండలం రాచాలలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. రాచాలలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య యాదవ్, గ్రామ పెద్దలు బొక్క శ్రీనివాసులు, మడిగల శ్రీనివాసులు, రాం ప్రశాంత్, జగన్నాథం, నరహరి తదితరులు పాల్గొన్నారు.



తుంకినీపూర్‌లో..



జడ్చర్లలో పోతురాజుల విన్యాసాలు

కొమిరెడ్డిపల్లిలో చెన్నకేశవస్వామి కల్యాణం



ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి సమీపంలో గుట్టపై వెలిసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద శ్రావణ చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్‌రెడ్డి, మాధవాచారి దంపతులతో పండితులు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అనిత, నవీన్ దంపతులు అన్నదానం చేశారు. మహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాజరాజేశ్వరి ఆలయంలో పారాయణం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శ్రావణ మాసోత్సవంలో భాగంగా చివరి శుక్రవారం సాయంత్రం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని శ్రీరాజ రాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై లలితా సహస్ర నామ పారాయణం జరిపి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

గంగా భవానీ మాతకు జలాభిషేకం

చిన్నచింతకుంట: మండలకేంద్రంలోని గంగా భవానీ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జూరాల ప్రాజెక్ట్ నుంచి పవిత్ర కృష్ణా జలాలను తీసుకువచ్చారు. కాగా ఆడపడుచులు మంగళహారతులతో జలాలకు స్వాగతం పలికారు. మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అన్నదానం చేపట్టారు.



గంగాభవానీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సామూహిక వరలక్ష్మి వ్రతం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కుర్హినిశెట్టికాలనీలోగల శ్రీతోట మైసమ్మ ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతం చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 523 సర్వే నంబర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఏదో సెన్సేషన్ సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెల్లవారుజామున ఇళ్లు కూలిచ్చేశారు అంటున్నారని, మరీ ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు తప్పు అని తెలియదా అని ప్రశ్నించారు. వారి హయాంలో చెరువులు, కుంటలను వదిలిపెట్టే లేదని ఆరోపించారు. పేద ప్రజలు అంటూ ఇప్పుడు చెబుతున్నారు, తమరి హయాంలో పేదలకు న్యాయం చేయాలని గుర్తుకు రాలేదా అని అన్నారు. అర్హులు ఉంటే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి వారికి న్యాయం చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్లు షేక్ ఉమర్, మోతీలాల్, నాయకులు మునీర్, చిన్న, అంజద్, రాశెద్‌ఖాన్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల ధ్వంసం సరికాదు

పాలమూరు: అర్హులైన పేదల ఇళ్లను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని, అర్హులైన దివ్యాంగులకు కూల్చినచోటనే రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజమైన కబ్జదారులను వదిలేసి అమాయక పేద ప్రజల ఇళ్లను కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశ్యం ఉంటే పాలమూరు పెద్ద చెరువులోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలు జరిగితే పట్టించుకోకుండా, దివ్యాంగుల దీక్షలో కూర్చుని మద్దతు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. పేదలపై ప్రేమ ఉంటే మంత్రిగా ఉన్న సమయంలో వారి సమస్యను పరిష్కారించాల్సిందని విమర్శించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నట్లు తెలిపారు.

కందూర్‌లో కంటి వైద్యశిబిరం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో శుక్రవారం కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు దామోదర్‌రెడ్డి, కృష్ణ, మహేందర్‌రెడ్డిలు సుమారు 300 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేసి ఆపరేషన్ల కోసం 30 మందిని సిఫారసు చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, విజయకుమార్, బాలరాజు, జనార్దన్, రాజమల్లారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమ్(ఆర్‌బీఎస్‌కే) మొబైల్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు ఫయాజ్, హజ్ర, జయకుమారీ కంటి, దంత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మండల వైద్యాధికారి డా.అబ్దుల్ రబ్ ఆధ్వర్యంలో శుక్రవారం భూత్పూర్ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పులే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ అయూబ్ ఖాన్, హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్ కుమార్, కృపావతి, ఆశ వర్కర్లు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



జిల్లాకేంద్రంలో సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫారుఖ్ మసీదు ప్రాంతం (వార్డు నం.21) తో పాటు గణేష్‌నగర్ (వార్డు నం.27) లో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, గచ్చిబాలి (వార్డు నం.25) లో చేపట్టిన కార్యక్రమాలను ఏఎంసీ జె.పవన్‌కుమార్ తనిఖీ చేశారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో అధికారులు పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రత్యేక అధికారి రాంరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈవో సీత్యానాయక్, వైద్యాధికారి డాక్టర శరత్ తదితరులు డ్రైడేలో పాల్గొన్నారు. అనంతరం దేవరకద్ర పీహెచ్‌సీని అధికారులు తనిఖీ చేశారు.

నవాబుపేట: పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శుక్రవారం రాంసింగ్‌తండా, హజిలాపూర్, పున్యానాయక్‌తండాల్లో పర్యటించారు. ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతీ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ నిర్వహణపై అధికారుల ఆగ్రహం



కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో అధికారులు

హన్వాడ: 'బాబోయ్ ఎంటీ ఇంత కంపు. ఎలా ఉంటున్నారు? అంగన్‌వాడీ కేంద్రమేనా ఇది? ఇలాగేనా నిర్వహణ' అంటూ అంగన్‌వాడీ నిర్వహణపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపేట–1వ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ నర్సిములు, ఎంపీడీఓ యశోదమ్మ, వైద్యసిబ్బంది తదితరులు డ్రైడే – ఫ్రైడేలో భాగంగా సందర్శించారు. నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దుర్వాసన భరించలేక ఎంపీడీఓ యశోదమ్మ ముతికి చేతిరుమాలును అడ్డుపెట్టుకుని చిన్నారులతో మాట్లాడడం గమనార్హం. కాగా అధికారులు పరిశీలనకు వచ్చిన సందర్భంలో అక్కడున్న అంగన్‌వాడీ టీచర్ సర్వేకు వెళ్లినట్లు ఆయా తెలిపారు. కేంద్రం పరిసరాలు అపరి శుభ్రంగా ఉండడం, చిన్నారులు చిరిగిన దుస్తులు ధరించి ఉండడం, దోమలు ఆవరించడం వంటివి విస్మయానికి గురిచేశాయి. వర్షం వచ్చినప్పుడు కేంద్ర కురుస్తోందని స్థానికులు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించిన అధికారులు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి గంగాబాయి తదితరులు ఉన్నారు.

మండలాల విలీన హామీపై హర్షం

మహమ్మదాబాద్/గండీడ్: వికారాబాద్ జిల్లాలో మహమ్మదాబాద్, గండీడ్ మండలాల విలీనం హామీపై స్థానిక ప్రజలు, నిరుద్యోగులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఇదివరకు రంగారెడ్డి జిల్లాలో ఉన్న గండీడ్‌ను జిల్లాల విభజన క్రమంలో మహబూబ్‌నగర్ కలిపారని అన్నారు. దీంతో ఉద్యోగాల విషయంలో తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. తిరిగి ఉమ్మడి మండలాన్ని వికారాబాద్‌లో కలపనుండడం తమకు కలిసొచ్చే విషయమని చెబుతున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడం.. ఆయన సానుకూలంగా స్పందించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొందరు మహబూబ్‌నగర్ ఉండాలి.. మరికొందరు మార్చితేనే బాగుంటుందని చర్చించుకుంటున్నారు.

హజిలాపూర్ చెరువుకు గండి



నవాబుపేట: మండల పరిధిలోని హజిలాపూర్ పెద్ద చెరువు గురువారం నిండింది. కాగా సాయంత్రం చెరువు చెంత గండి పడి నీరు పోతున్న శబ్దం రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. చెరువు ఆయకట్టు పరిధిలో పొలం ఉన్న రైతు సునీల్ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో డీఈ నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శుక్రవారం రంగంలోకి దిగింది. చెరువు గండిని గజ ఈతగాళ్ల సాయంతో గుర్తించారు. కట్టపై చెట్లు తొలగించి గండిని ఇసుక బస్తాలతో పూడ్చి నీటి లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

అధికారుల చిత్రపటానికి పాలాభిషేకం

మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి శివారు ఆదర్శనగర్ సర్వేనంబర్ 523లో దివ్యాంగులకు కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని తాత్కాలికంగా ఇళ్లను నిర్మించుకున్నారు. కాగా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు రెండు రోజుల క్రితం వాటిని కూల్చివేయించారు. దీంతో అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంనాయక్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, గిర్దావర్లు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్ తదితరుల ఫొటోలతో కూడిన బ్యానర్‌కు శుక్రవారం దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఉదయ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామీణ రోడ్లను బీటీగా దశల వారీగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ నరేందర్ రెడ్డి, డీఈఈ జయశేఖర్, మాజీ ఎంపీపీ నిత్యానందం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్య, కౌన్సిలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేద్దాం



మాట్లాడుతున్న కృష్ణవర్ధన్‌రెడ్డి

హన్వాడ: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 4 నుంచి ప్రారంభమవుతుందని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు 2024, భవిష్యత్ కార్యాచరణ గురించి కార్యకర్తలతో చర్చించారు. పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నాగం బాయి తండాలో పార్టీ అధ్యక్షుడు విఠల్‌ను పరామర్శించారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య, బుచ్చిరెడ్డి, రఘురాంగౌడ్, మహేందర్‌రెడ్డి, వేణు, లింగం, రమణారెడ్డి, చెన్నప్ప పాల్గొన్నారు.

పాలమూరు: ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకుడికి కావాల్సినంత బలం కార్యకర్తలేనని బీజేపీ నేతలు పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండల ముఖ్య నాయకుల సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సతీష్‌కుమార్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ అనిల్‌కుమార్

జడ్చర్ల: రైతులకు కావలసిన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, యూరియా నిల్వలు కూడా ఉన్నాయని స్థానిక ఏడీఏ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఆగ్రో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని.. అవసరం కొద్ది వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలని తెలిపారు. వ్యాపారులు యూరియాకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల అవసరాన్ని గుర్తించి మాత్రమే యూరియా విక్రయాలు జరపాలని, విచ్చల విడిగా యూరియాను విక్రయించడం వల్ల మునుముందు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు. ఒక రైతుకు ఐదు బస్తాలకు మించి ఇవ్వవద్దని దుకాణ డీలర్లను ఆదేశించారు. ప్రస్తుతం యూరియా కొరత ఎక్కడా లేదని ఆయన పేర్కొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలని వినతి



జడ్చర్ల: సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను వెంటనే పెంచాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న చార్జీలు ఎంత మాత్రం సరిపోవడం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. హాస్టళ్లలో పేద విద్యార్థులు ఉంటారని.. వారికి నాణ్యమైన భోజనం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి సమర్పించారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, సీఐటీయూ నాయకులు సత్తయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



దేవరకద్ర రూరల్: ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కౌకుంట్ల మండల ప్రత్యేక అధికారి భాస్కర్ సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న దుకాణా సముదాయాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్రటరీ బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

కుంటలను ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల టౌన్: మున్సిపల్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నల్లకుంటలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాయకులు యాదగిరి, తెలుగు సత్తయ్య, అనిల్‌కుమార్, జగన్, శ్రీను, లక్ష్మీదేవి, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



నవాబుపేట: ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామాల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. కాగా జాబితాలో సవరణలు తదితరాలపై పంచాయతీ అధికారులకు లేదా మండల కార్యాలయంలో తెలియజేయాలపై అధికారులు సూచించారు. గతంలో 54 గ్రామాల్లో ఉన్న 456 వార్డుల వారీగా జాబితాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టినట్లు మండల అధికారులు వివరించారు. కాగా గతంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 12 గ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండగా తాజాగా అట్టి గ్రామాలు తిరిగి వికారాబాద్ జిల్లా పరిధిలో చేరాయి. దీంతో 12 గ్రామాలు, 60 వార్డులు మినహాయిస్తే 42 గ్రామాలు, 390 వార్డులలో జాబితాల పరిశీలన చేపట్టినట్లు పేర్కొన్నారు. వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.